సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 13 । జూన్ । 2024



న్యాయం చేయకుంటే భూమి ఇవ్వం

తమకు న్యాయం చేయకుంటే భూమి ఇవ్వబోమని రీజినల్ రింగ్ రోడ్డులో భూమి కోల్పోతున్న రైతులు తెలిపారు. - 8లో



గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములత కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

భువనగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మొదటి విడత ప్రవేశాలకు 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు భువనగిరి, ఆలేరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ సుజయ్‌కుమార్, హరికృష్ణ బుధవారం తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ టెన్త్ మెమో, కులం, బోనోఫైడ్‌తో పాటు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో https://iti.telangana.gov.in ద్వారా అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 98665 43920 సంప్రదించాలని కోరారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



నోట్‌బుక్స్ అందజేస్తున్న అదనపు కలెక్టర్

బీబీనగర్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ కోరారు. బుధవారం బీబీనగర్ మండలంలోని జమీలాపేట గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, నోడల్ అధికారి సురేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత

భువనగిరి క్రైం: బాల కార్మికులను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా న్యాయమూర్తి ఏ.జయరాజు సూచన మేరకు బుధవారం భువనగిరి కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ శ్రీఅయ్యంగారు, సహాయ కార్మిక అధికారి మోహినుద్దీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్ గౌడ్, లీగల్ హయర్ డిఫెన్స్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

యాదగిరిగుట్ట: తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అపాయింట్‌మెంట్ డేట్‌ను వెంటనే ప్రకటించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021కి సంబంధించి వేతన సవరణ 50శాతానికి పెంచి చేయాలని, ఇంటీరియల్ రిలీఫ్ 25శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణకు సంబంధించిన 50శాతం బాండ్ డబ్బులను కేవలం డ్రైవర్లకు మాత్రమే చెల్లించారని, మిగతా కేటగిరీలకు సంబంధించిన కార్మికులందరికీ వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం డిపో కార్యదర్శిగా సోకం వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నల్లగొండ రీజినల్ కార్యదర్శి బాసాని వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి మంగ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పాండురంగయ్య, కురుమిద్ద మల్లయ్య, నాయకులు మల్లయ్య, కేబీచారి, రంగా శ్రీనివాస్, రమేష్, డి.వెంకన్న తదితరులున్నారు.

కొనసాగుతున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

భువనగిరి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. జీహెచ్ఎం పదోన్నతుల కోసం ప్రకటించిన స్కూల్ అసిస్టెంట్ల జాబితాలో ఉన్నవారు ఆన్‌లైన్ ద్వారా ఆప్షన్లు పెట్టుకునే ప్రక్రియ జరుగుతోంది. అదే విధంగా గత రెండు రోజుల క్రితం ప్రకటించిన అప్‌గ్రేడ్ పొందిన లాంగ్వేజ్ తెలుగు, హిందీ, ఉర్దూతో పాటు పీఈటీలకు చెందిన జాబితాలో ఉన్న వారు తమ అభ్యంతరాలను సమర్పించడంతో వాటిని బుధవారం అధికారులు పరిశీలించారు. వీటితో పాటు ప్రత్యేక విద్యకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాలను సైతం అధికారులు పరిశీలించారు.

మోగిన బడి గంట

● పునఃప్రారంభమైన పాఠశాలలు ● తొలిరోజు 50శాతం లోపే హాజరు



ఆత్మకూరు(ఎం) మండలంలోని కప్రాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

భువనగిరి: వేసవి సెలవుల అనంతరం బుధవారం పండుగ వాతావరణంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆటపాటలు, షికార్లతో గడిపిన విద్యార్థులు బడి బాట పట్టారు. డప్పు, వాయిద్యాలు, బ్యాండ్ చప్పుళ్ల మధ్య ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాలలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. తొలిరోజు పాఠశాలలకు సుమారు 50 శాతం లోపే హాజరయ్యారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రారంభం రోజున తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు.



ఆలేరు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

వంతెన కష్టాలు

ప్రమాదకరంగా మారిన లో లెవల్ బ్రిడ్జీలు

- వరద పోటెత్తితే రోజుల తరబడి నిలిచిపోతున్న రాకపోకలు
- అత్యవసరమైతే కిలోమీటర్ల దూరం ప్రయాణం
- హై లెవల్ వంతెన నిర్మాణాలకు నిధుల కష్టాలు
- కొన్నిచోట్ల నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు



జూలూరు- రుద్రవెల్లి మధ్యన నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు

సాక్షి, యాదాద్రి: వర్షకాలం వచ్చిందంటే జిల్లాలో వాగులు, మూసీ నదిపై పలు చోట్ల లో లెవల్ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వరదనీరు పోటెత్తితే రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసరమైతే కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. హై లెవల్ వంతెనల నిర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయడం లేదు. కొన్ని చోట్ల మంజూరైనా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. అధిక వర్షాలు కురిస్తే ప్రమాదం పొంచి ఉండడంతో లో లెవల్ బ్రిడ్జి సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆయా మండలాల్లో శిథిలావస్థకు చేరిన వంతెనలు ఇలా..

❖ భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు- రుద్రవెల్లి గ్రామాల మధ్యన నిజాం కాలం నాటి లోలెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.8.50 కోట్లు మంజూరు చేసింది. 2016లో పిల్లర్ నిర్మాణ పనులు చేపట్టారు. భూసేకరణలో అధికారుల జాప్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పిల్లర్ల వద్దే పనులు నిలిచిపోయాయి.

❖ భూదాన్‌పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెం-రెడ్డిబావి(దంతూర్) గ్రామాల మధ్యన చిన్నేరు బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.6.22 కోట్లు మంజూరు చేసింది. 2021లో శంకుస్థాపన చేయగా, 2022 జనవరిలో పనులు ప్రారంభించారు. రెండున్నరేళ్లు అయినా ప్రస్తుతం పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. వరద వచ్చినప్పుడు శివారెడ్డిగూడెం, దంతూర్, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

❖ పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల బీబీనగర్ మండలం జంపల్లి గ్రామాల మధ్య మూసీపై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.2.15 కోట్లు, శివారెడ్డిగూడెం, సూరెపల్లి గ్రామాల మధ్యన మూసీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.25 కోట్లు మంజూరయ్యాయి. గతేడాది ఆగస్టులో పంచాయతీరాజ్ అధికారులు సర్వే చేశారు. కానీ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. అనాజిపురం-రావిపహాడ్ గ్రామాల మధ్యన లో లెవల్ కాజ్‌వేలపై బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది.

❖ భువనగిరి మండలం బొల్లేపల్లి- వలిగొండ మండలం సంగెం గ్రామాల మధ్యన మూసీ నదిపై బీమలింగంవద్ద ఉన్న లో లెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. మూసీ ఉధృతి పెరిగితే చౌటుప్పల్- భువనగిరి మధ్యన రాకపోకలు నిలిచిపోతాయి.

❖ రాయిగిరి - మోత్కూరు మార్గంలో మోటకొండూరు మండలం కాటేపల్లి- ముత్తిరెడ్డిగూడెం గ్రామాల మధ్యన మంజూరైన బ్రిడ్జి పనులు మూడేళ్లు దాటినా పూర్తి కాలేదు.

❖ బొమ్మలరామారం మండలం మునీరాబాద్- బండకాడిపెల్లి గ్రామాల మధ్యన శామీర్‌పేట వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 2022లో రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

❖ గుండాల మండలంలో గత సంవత్సరం కురిసిన వర్షానికి కొట్టుకుపోయిన నూనెగూడెం బ్రిడ్జి పనులు ఇంకా ప్రారంభించలేదు.

❖ రాజాపేట మండలంలోని పారుపల్లి వాగుపై కల్వర్టు 2010లో వర్షాలకు కొట్టుకుపోయింది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.12.06 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు.

❖ రాజాపేట మండలంలోని బేగంపేట, చల్లూరు వాగులపై ఉన్న కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. నిధులు మంజూరు చేసి టెండర్లు వేసి పనులు వదిలేశారు.

❖ ఆలేరు మండలం కొలనుపాక-సిద్దిపేట మార్గంలో కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. అదే విధంగా కొలనుపాక గ్రామం పక్కన గల పీతాంబరం వాగు, పెద్దవాగులపై లోలెవల్ బ్రిడ్జిలపై వరద పొంగితే రాకపోకలు నిలిచిపోతాయి.

❖ ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో బహద్దూర్‌పేట, మంతపురి వెళ్లే మార్గంలో ఉన్న రెండు లో లెవల్ బ్రిడ్జిలపై వరద వస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



జూలూరు- రుద్రవెల్లి మధ్యన కల్వర్టుపై వరద ప్రవహిస్తుండడంతో నిలిచిపోయిన రాకపోకలు (ఫైల్)

వర్షాలు వస్తే రాకపోకలు బంద్



ప్రతి వానాకాలం జూలూరు - రుద్రవెల్లి బ్రిడ్జిపై నుంచి మూసీ పొంగి ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో తరచుగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. నేను బీబీనగర్‌లో ప్రైవేట్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నా. వర్షాలు వస్తే బడికి బంద్ కావాల్సిందే. బీబీనగర్ వెళ్లే విద్యార్థులు, కంపెనీల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు వెళ్లలేరు. కొందరైతే గత్యంతరం లేక 15 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి.

– వంగరి మోహన్‌దాస్, జూలూరు గ్రామం, భూదాన్‌పోచంపల్లి మండలం



గుండాల మండలంలోని నూనెగూడెం రోడ్డులో గత సంవత్సరం వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు



రాజాపేట మండలం కుర్రారం మార్గంలో ప్రమాదకరంగా కల్వర్టు

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

‘డీసీసీబీ’ వార్!



క్యాంపులో కుంభం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు

- చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ ఎత్తులు
- వీగిపోయేలా బీఆర్ఎస్ ప్రణాళిక
- వ్యూహ ప్రతివ్యూహాల్లో ఇరు పార్టీలు
- 15 మంది డైరెక్టర్లను దగ్గర చేసుకున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి
- క్యాంపునకు కర్నాటక తరలివెళ్లిన డైరెక్టర్లు
- బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయిన ఐదుగురు అవిశ్వాసం ఓటింగ్‌లో తనకు మద్దతుగా నిలుస్తారని మహేందర్‌రెడ్డి భావన



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న డీసీసీబీ డైరెక్టర్ రాంచందర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌పై అవిశ్వాసం వ్యవహారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ పార్టీ, వీగిపోయేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రణాళికలు అమల్లో పెడుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లను అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం ప్రారంభించడంతోపాటు క్యాంపు రాజకీయాలకు హస్తం పార్టీ తెరతీసింది. డీసీసీబీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో 13 మంది డైరెక్టర్లు కర్నాటకలో క్యాంపునకు తరలివెళ్లారు. ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం నెగ్గించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

డైరెక్టర్ల మద్దతు కూడగట్టిన శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్‌కు వ్యతిరేకంగా డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి 13 మంది డైరెక్టర్లు, వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి మద్దతు కూడగట్టారు. తాను ఇప్పుడు చైర్మన్ అయితే.. భవిష్యత్తులో రాజకీయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చనే ఉద్దేశంతో శ్రీనివాస్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. బ్యాంకు డైరెక్టర్లు 14 మంది సంతకాలతో ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై ఈనెల 10న అవిశ్వాసం నోటీసును జిల్లా సహకార అధికారి కిరణ్‌కు అందజేశారు. చైర్మన్ మహేందర్‌రెడ్డి సన్నిహితుడు, యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన డీసీసీబీ డైరెక్టర్ రాంచందర్ బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇది కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలోనే జరిగింది.

ఇద్దరిని వెనక్కి లాక్కునే ప్రయత్నంలో మహేందర్‌రెడ్డి

ప్రస్తుతం బ్యాంకులోని 19 మంది డైరెక్టర్లలో కాంగ్రెస్ పార్టీకి వైస్ చైర్మన్ సహా 9 మంది డైరెక్టర్లు ఉన్నారు. మిగితా 10 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. వారిలో బుధవారం ఒక డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 10కి చేరగా, బీఆర్ఎస్ బలం 9కి తగ్గింది. బీఆర్ఎస్‌కు చెందిన మరో ఐదుగురు కూడా శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. దీంతో కాంగ్రెస్ బలం 15కు చేరుకుంది. అయినప్పటికీ అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు మహేందర్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉండి, కుంభం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా నిలిచిన ఐదుగురిలో ఇద్దరిని మహేందర్‌రెడ్డి వెనక్కి లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. తమనుంచి వెళ్లిపోయిన ఐదుగురు ఇంకా బీఆర్ఎస్ పార్టీకి చెందినవారేనని, అవిశ్వాసం ఓటింగ్‌లో తనకు మద్దతుగా నిలుస్తారని భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు 14 మంది డైరెక్టర్ల మద్దతు ఉంటేనే అవిశ్వాసం నెగ్గుతుంది. కాంగ్రెస్ వైపు వెళ్లిన వారిలో ఇద్దరిని వెనక్కి లాకుంటే కాంగ్రెస్ బలం 13 అవుతుంది. దాంతో అవిశ్వాసం వీగిపోనుంది. ఆ దిశగా మహేందర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

వ్యక్తిగత ఆరోపణల్లోకి వెళ్లడం లేదు : కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మహేందర్‌రెడ్డి అక్రమాలు, ఏకపక్ష నిర్ణయాలపై తాము అవిశ్వాసం నోటీసు ఇచ్చామని కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కర్నాటకలో క్యాంపులో ఉన్న ఆయన తనతోపాటు డైరెక్టర్లు మాట్లాడిన ఓ వీడియో విడుదల చేశారు. నాలుగేళ్ల రెండు నెలలపాటు తమను పట్టించుకోకపోయినా ఆయనకు సహకరించామని పేర్కొన్నారు. ఒంటెత్తు పోకడలు భరించలేకే అవిశ్వాసం నోటీసు ఇచ్చామని, దాంతో డైరెక్టర్లను డబ్బులు పెట్టి కొంటానంటూ డైరెక్టర్ల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఆయనపై అనేక భూకబ్జా కేసులు ఉన్నాయని, వ్యక్తిగత విమర్శలకు దిగవద్దని ఊరుకుంటున్నామన్నారు. అవిశ్వాసం నోటీసు ఇచ్చిన తరువాత మేనేజింగ్ కమిటీ సమావేశం ఎలా పెడతారని ప్రశ్నించారు. డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, సైదులు మాట్లాడుతూ.. తమను ప్రలోభాలకు గురిచేశారని మహేందర్‌రెడ్డి మాట్లాడటం సరికాదన్నారు. ఆయన నియంతృత్వ పాలన వల్లే అవిశ్వాసం పెట్టామని, బ్యాంకులో బదిలీలు, ఇతరత్రా వ్యవహారాల్లో ఏకపక్షంగా వ్యవహరించారని చెప్పారు. ఈనెల 28న అవిశ్వాసం నెగ్గుతామని, శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్‌ను చేసుకుంటామని వివరించారు.

స్వయంకృషితో లక్ష్యాలు సాధించాలి

● కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి: విద్యార్థులు స్వయంకృషితో తమ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 68 మంది విద్యార్థులకు బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్, డీఈఓ నారాయణరెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర సభ్యుడు మహేందర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు కడారి వెంకటేశం, జంపాల అంజయ్య పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు డ్రా..

గిరిజన బాల బాలికలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 10సీట్లలో ప్రవేశానికి వచ్చిన 27 దరఖాస్తులకు సంబంధించి కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి యాదగిరిగుట్టలోని విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, డీఆర్‌డీపీఎం ఏపీ కృష్ణన్ పాల్గొన్నారు.

పంటలను సందర్శించాలి

భువనగిరి రూరల్: అధికారులు ప్రతిరోజు గ్రామాల్లోని పంటలను సందర్శిస్తూ రైతులకు చీడపీడల నివారణ సూచనలు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. బుధవారం భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామ రైతువేదికలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి కె.అనురాధ, భువనగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు దేవ్‌సింగ్, ఆలేరు సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటేశ్వర్‌రావు, యాదగిరిగుట్ట సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మావతి పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ హనుమంతు కే.జెండగే తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ఆలేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్

యాదగిరిగుట్ట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలేరు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించి, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన, నోట్ పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ కోణంతోనే అవిశ్వాసం

● డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: రాజకీయ కోణంతోనే తనపై అవిశ్వాసం పెడుతున్నట్లు భావిస్తున్నానని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం డీసీసీబీ పాలకవర్గ సమావేశం జరగాల్సి ఉండగా.. కోరం లేక వాయిదా పడింది. ఆ తర్వాత మహేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తనకు ఇష్టమైన సహకార రంగంలో 1987 నుంచి వివిధ పదవులకు పోటీ చేస్తూ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ స్థాయికి ఎదిగానని చెప్పారు. 36 సంవత్సరాల పాటు పీఏసీఎస్ చైర్మన్‌గా, 9 సంవత్సరాలు డీసీసీబీ డైరెక్టర్‌గా కూడా పనిచేశానని చెప్పారు. నష్టాల బాటలో ఉన్న నల్లగొండ డీసీసీబీని లాభాల బాటలో నడిపించడంతో పాటు రూ.2400 కోట్ల టర్నోవర్‌కు చేర్చానన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ బ్యాంకు చైర్మన్ అవార్డు తీసుకుని బ్యాంకు ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలిపానన్నారు. దీనికి బ్యాంకు వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు అందించిన సహకారమే కారణమన్నారు. రాష్ట్రంలో ఏ సహకార బ్యాంకూ అందించని విధంగా రైతు బిడ్డల విదేశీ విద్య కోసం విద్యా రుణాలు ప్రవేశ పెట్టి 1500 మందికి రూ.118 కోట్ల రుణాలు అందించినట్టు చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అవిశ్వాసం వీగిపోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

జాతీయ రహదారిపై లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

మునగాల: మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తా పడింది. వివరాలు.. పూణె నుంచి విజయవాడకు బొప్పాయి మొక్కల లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా వచ్చి బరాఖత్‌గూడెం వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా లారీలో ఉన్న బొప్పాయి మొక్కలను స్థానికులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

భువనగిరి క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మహిళ మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో బుధవారం జరిగింది. పట్టణ ఎస్‌ఐ వీరస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని ఠాగూర్ రోడ్డులో నివాసముంటున్న కూనూరు భారతమ్మ ఇంటికి బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తలుపు కొట్టారు. దీంతో ఆమె తలుపు తీయగా.. ఏవో డాక్యుమెంట్స్ కావాలని అడిగి లోపలికి వచ్చి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు గురై పాడి గేదె మృతి

బొమ్మలరామారం: మండలంలోని మేడిపల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై పాడి గేదె మృతి చెందింది. వివరాలు.. మేడిపల్లి గ్రామానికి చెందిన వేముల విష్ణు వ్యవసాయ కూలీగా పనిచేయడంతో పాటు పాడి గేదెను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవగా.. వ్యవసాయ బావి వద్ద కట్టేసిన అతడి గేదె పిడుగుపాటుకు గురై మృతిచెందింది. బుధవారం ఉదయం విష్ణు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూసేసరికి గేదె మృతిచెంది కనిపించింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ఆదుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావుకు బాధితుడు వినతి పత్రం అందజేశాడు.

రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక



సుధాకర్

రామగిరి(నల్లగొండ): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రకటించిన రాష్ట్రస్థాయి అవార్డుకు నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి చిలుముల సుధాకర్ ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం కళాశాలలోని ఎన్‌సీసీ కేడెట్లతో మెగా రక్తదాన శిబిరాలు చేపట్టినందుకు గాను ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

ఆదాయం కాదు.. సౌకర్యాలు ముఖ్యం

- యాదాద్రి ఆలయాధికారుల సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ఆలయాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, చిత్రంలో ఈఓ తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి భారీగా వస్తున్న ఆదాయం ముఖ్యం కాదని.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నదే ప్రధానమని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి కొండపైన ఈఓ కార్యాలయంలో బుధవారం వైటీడీఏ, దేవాలయంలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత రెండు నెలలుగా యాదాద్రి కొండపైన రివ్యూ నిర్వహించలేదన్నారు. రెండు నెలల్లోనే కొండపైన భక్తులకు ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో భారీగా సౌకర్యాలు పెరిగాయని పేర్కొన్నారు. ప్రస్తుతం క్షేత్రానికి వచ్చే భక్తులకు 1000 మందికి అన్నప్రసాదం అందజేస్తున్నారని, కొండ కింద నూతనంగా నిర్మాణం జరిగిన అన్నదాన భవనంలో ప్రతిరోజు 4వేల నుంచి 5వేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ క్యాలెండర్లలో కొంత మంది సిబ్బంది అవసరం ఉన్నారని, వారిని నూతనంగా నియమించాలని రివ్యూలో నిర్ణయించామన్నారు. అంతేకాకుండా ఆలయంలో పూజాది కార్యక్రమాలకు కొత్తగా అర్చకులు అవసరం ఉన్నారని, ప్రభుత్వం, దేవాదాయశాఖ మంత్రి, కమిషనర్‌తో మాట్లాడి వారిని సైతం నియమించనున్నట్లు తెలిపారు. కొండపైన తూర్పుమాడ వీధిలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లుగానే.. కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద మరొక ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాయగిరి నుంచి యాదాద్రి కొండపైన శంకు, చక్ర, తిరునామాలు కనిపించే విధంగా ఏర్పాట్లు చేస్తామని, హైదరాబాద్ నుంచి రాయగిరి మీదుగా యాదాద్రికి వచ్చే క్రమంలో జాతీయ రహదారిపై కమాన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కొండపైకి వచ్చే మెట్ల మార్గంలో సోలార్ షెడ్డును ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ప్రతి మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు స్థానికులకు స్వామివారి స్వయంభూ దర్శనం కల్పించేవారని, కానీ ఇప్పుడు ప్రతి శనివారం, మంగళవారం ఉదయం అర్ధగంట పాటు దర్శనం కల్పిస్తామని ఈఓ నిర్ణయించారని తెలిపారు. కొండ పైన భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి పూజాది కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయాధికారులు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా కొండపైన ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. బ్రేక్ దర్శనం సమయంలో బొట్టుతో పాటు తీర్థం భక్తులకు అందించే పద్ధతిని పునరుద్ధరిస్తామన్నారు. గిరి ప్రదక్షిణ రోడ్డును త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని వైటీడీఏ ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. కొండపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, దర్శనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అర్చకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూమి దక్కదేమోనని రైతు బలవన్మరణం



కసన (ఫైల్)

అడవిదేవులపల్లి : గత పదహారేళ్లుగా సాగుచేసుకుంటున్న భూమి తనకు దక్కదేమోననే ఆందోళనతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బంగారికుంట తండాకు చెందిన కుర్ర కసన(58) ముల్కచర్ల పరిధిలో నాలుగు ఎకరాల అటవీ భూమిని గత 16 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అటవీ భూమికి పట్టా కోసం గతంలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో అటవీ అధికారులు ఆక్రమణలో ఉన్న అటవీ భూమిలో మొక్కలు నాటుతామని గత నాలుగు రోజులుగా అతడికి హెచ్చరికలు జారీచేస్తూ వచ్చారు. బుధవారం అటవీ అధికారులు, సిబ్బందితో కలిసి వచ్చి గుంతలు తీయించి మొక్కలు నాటేందుకు యత్నించారు. ఆ దృశ్యాలను దగ్గరుండి చూసిన రైతు కసన.. మనస్తాపానికి గురై చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మిర్యాలగూడ ఎఫ్ఆర్‌వో ఆనందరెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చిన్నారిని నేలకేసికొట్టి హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందనే ఘాతుకం



మృతిచెందిన మహన్వి

చివ్వెంల(సూర్యాపేట): వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని చిన్నారిని నేలకేసి కొట్టి హత్యచేసిన సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా గుండారం గ్రామానికి చెందిన కటకట లక్ష్మణ్‌తో అదే జిల్లా రంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన రమ్య అలియాస్ నవ్యశ్రీ వివాహం ఆరేళ్లక్రితం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు అరుణ్య (04), మహన్వి (22 నెలలు). కాగా ఏడు నెలలుగా రమ్యశ్రీ అదే గ్రామానికి చెందిన బొల్లెం అరవిందరెడ్డితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. 20 రోజుల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకుని ప్రియుడితో కలిసి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి వచ్చి అక్కడే నివాసం ఉంటున్నారు. అరవిందరెడ్డి ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నారి మహన్వి తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని భావించి మంగళవారం రాత్రి అరవిందరెడ్డి ఆమెను కొరికి, కొట్టి హింసించి నేలకేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు రమ్య అత్త కటికట గంగమణి ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి ఆదేశాలతో ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చిన్నారికి రెండు చెంపలు, భుజాలు, రెండు చేతులు, పిరుదులపై, తలకు తీవ్ర గాయాలై ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు.

న్యాయం చేయకుంటే భూమి ఇవ్వం

- రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు



రైతులతో సమావేశమైన ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్: వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న తమకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని, లేదా మరోచోట భూమి కేటాయించాలని రీజినల్ రింగ్ రోడ్డులో భూమిని కోల్పోతున్న రైతులు అన్నారు. తమకు న్యాయం చేయకుంటే భూమి ఇవ్వమని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి చౌటుప్పల్ మండల పరిధిలోని నేలపట్ల రెవెన్యూ గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం(అవార్డు ఎంక్వైయిరీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శేఖర్‌రెడ్డి రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండలంలోని నేలపట్లలో 70.20 ఎకరాలు, చిన్నకొండూర్‌లో 75.26 ఎకరాలు, వలిగొండ మండలంలోని పొద్దుటూరులో 93.32 ఎకరాలు, పహిల్వాన్‌పురంలో 110.24 ఎకరాలు, గోకారంలో 25.11 ఎకరాలు, రెడ్లరేపాకలో 103.29 ఎకరాలు, వర్కట్‌పల్లిలో 44.11 ఎకరాల చొప్పున గుర్తించిన భూమికి సంబంధించిన రైతులతో అవార్డు ఎంక్వైయిరీ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా చౌటుప్పల్ మండలంలోని చౌటుప్పల్‌లో 163.00 ఎకరాలు, లింగోజిగూడెంలో 2.00 ఎకరాలు, తంగడపల్లిలో 16.00 ఎకరాలు సేకరించాల్సి ఉందని చెప్పారు. దీనికిగాను త్వరలోనే సర్వే చేపడుతామన్నారు. పరిహారం విషయంలో ఎకరానికి చౌటుప్పల్ మండలంలోని చిన్నకొండూర్‌లో రూ.25లక్షలు, నేలపట్లలో రూ.25లక్షలు, తాళ్లసింగారంలో రూ.25లక్షలు, వలిగొండ మండలంలోని గోకారంలో రూ.11లక్షలు, పహిల్వాన్‌పురంలో రూ.14.68లక్షలు, ప్రొద్దుటూరులో రూ.11.01లక్షలు, రెడ్లరేపాకలో రూ.9.50లక్షలు, వర్కట్‌పల్లిలో రూ.29లక్షలు, రూ.14.82లక్షల చొప్పున చెల్లించనున్నామని తెలిపారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రైతులు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, అధికారులు సురేంద్రశర్మ, సుధాకర్, మురళీధరన్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం



ఉమ (ఫైల్)

పాలకవీడు: ఉరేసుకుని యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఉబెల్లి ఉమ(27)కు మూడు నెలల క్రితం సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. వారం రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన ఉమ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా తన భర్తకు జాబ్ లేదనే మనస్తాపంతో ఆమె బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కొండమల్లేపల్లి: మండలంలోని ఆంగోతుతండా, మంగ్యతండాలలో బుధవారం దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సారాయి తాగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆంగోతుతండాలో ఎక్సైజ్ అధికారులు నాటుసారా తయారీకి ఉపయోగించే 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటు సారాయి తయారుచేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు వీరబాబు, మల్లేష్, నరసింహ, సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, ఎస్. కృష్ణ, నాగరాజు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల(కోదాడ): మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో వేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి కోదాడ వైపు బైక్‌పై ఒక పురుషుడు, మహిళ వెళ్తుండగా.. వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి వారిని ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్నవారు ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గాయపడిన ఇరువురిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియరాలేదు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ

- వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

మునగాల(కోదాడ): మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ శివారులో గల శ్రీస్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.2లక్షల విలువైన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. దేవాదాయ శాఖ ఈఓ టి. వెంటాచలపతి, ఆలయ పూజారి కందాళ శ్రీనివాసాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆలయ ప్రాంగణంలో వందలాది మంది రైతులు, గ్రామస్తుల సమక్షంలో దేవాలయ భూముల వేలం పాట నిర్వహించామని, అనంతరం దేవాలయానికి తాళాలు వేసి ఇళ్లకు వెళ్లినట్లు వివరించారు. కాగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో దేవాలయం వాచ్‌మెన్ గోవింద్ వచ్చి చూడగా.. దేవాలయం తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టి గమనించి తమకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో వెంటనే తాము మునగాల పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. పోలీసులు క్లూస్‌టీంతో వచ్చి వివరాలు సేకరించారని పేర్కొన్నారు. వెండితో చేసిన ఐదు పంచ పాత్రలు, రెండు దద్దిరినాలు, ఒక వెండి ప్లేటు, ఒక వెండి శటాకి, రెండు వెండి పాదాలు చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు మునగాల ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గతంలోనూ చోరీలు..

ఈ దేవాలయంలో గతంలో మూడు సార్లు చోరీలు జరిగినప్పటికీ అవి వెలుగులోకి రాలేదని గ్రామస్తులు ఆరోపించారు. దేవాలయానికి 26ఎకరాల సాగుభూమి ఉందని, ఈ భూముల వేలంలో రైతుల వద్ద నుంచి రూ.500 చొప్పున డిపాజిట్ రూపంలో సేకరించడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈఓ వెంకటాచలపతిని వివరణ కోరగా.. దేవాలయ అభివృద్ధి కోసం డిపాజిట్ సొమ్మును వినియోగిస్తున్నామని చెప్పారు.

రూ.12లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు, పోలీసు సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను బుధవారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మిర్యాలగూడలోని తన కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖరరాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మిర్యాలగూడ పట్టణంలో గుట్కా హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్న గోపారపు రాజు, ఆకుతోట నర్సింహకు చెందిన షాపులపై బుధవారం వన్ టౌన్ పోలీసులు దాడులు చేసి రూ.12లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న గుట్కా శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులకు పంపించామని, వారి నుంచి రిపోర్ట్ వచ్చాక వ్యాపారులిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. గుట్కాను గుర్తించి స్వాధీనం చేసుకున్న వన్ టౌన్ సీఐ సుధాకర్, సిబ్బందికి రివార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్..

ఇంటికి రంగులు వేయడానికి వచ్చి చోరీకి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన కంచర్ల ఊర్మిళ గత నెల 30వ తేదీన తన ఇంటికి రంగులు వేయించేందుకు కొంతమంది పనివాళ్లను తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఇంట్లోని సామాన్లు సర్దుతుండగా.. 8తులాల బంగారంతో పాటు రూ.85వేలు దొంగిలించారు. ఐదురోజుల తర్వాత బంగారం, నగదు కనిపంచకపోవడంతో బాధితురాలు మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి సీఐ వీరబాబు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఇద్దరు మహిళా నిందుతులను గుర్తించి వారి వద్ద నుంచి నగదుతో పాటు 8 తులాల బంగారం స్వాదీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్, రూరల్ సీఐలు సుధాకర్, వీరబాబు, ఎస్‌ఐలు శేఖర్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం చేపట్టాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త నర్సింహారెడ్డి

నడిగూడెం: ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నర్సింహారెడ్డి కోరారు. బుధవారం నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలోని రైతు వేదికలో నాబార్డు ఆర్థిక సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు సేంద్రియ వ్యవసాయంపై 15 రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిందని, దీంతో భూసారం తగ్గడంతో పాటు, పంట దిగుబడులు కూడా తగ్గుతున్నాయన్నారు. అలాగే పురుగు మందుల వినియోగం కూడా విపరీతంగా పెరిగిందన్నారు. దీంతో ప్రాణాంతక రోగాలు వ్యాపిస్తున్నాయన్నారు. కాబట్టి ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని, దానిలో భాగంగా పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని, జీవ ఎరువులు, వర్మీ కంపోస్టు, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించాలన్నారు. దీంతో భూసారం పెరగడంతో పాటు, పంట దిగుబడులు కూడా నాణ్యంగా వస్తాయన్నారు. అలాగే చీడపీడల నివారణకు వేప సంబంధిత ద్రావణాలు, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిహస్త్రం, ఆవు మూత్రం, పేడ, ఇంగువ కషాయం, ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎం. రాజగోపాలరావు, స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రాంపల్లి సతీష్ కుమార్, మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు కొండారెడ్డి, కస్తూరి లక్ష్మయ్య, అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీకి రూ.12 వేలు, పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇవ్వడంతో పేదలంతా కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేశారని.. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఇప్పటివరకు ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధిహామీకి నిధుల్లో కోతలు విధిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఈనెల 16న మిర్యాలగూడలో నిర్వహించే విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నారి ఐలయ్య, బొంగరాల వెంకన్న, రెమిడాల భిక్షం, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ రసాయనాల ట్యాంకర్ పట్టివేత



పట్టుబడిన ట్యాంకర్

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెం గ్రామంలో బుధవారం వ్యర్థ రసాయనాలు కలిగిన ట్యాంకర్‌ను గ్రామస్తులు పట్టుకున్నారు. వివరాలు.. దోతిగూడెం గ్రామ పరిధిలోని కెమిల్ లైఫ్ రసాయన కంపెనీ నుంచి బుధవారం సాయంత్రం వ్యర్థ రసాయనాలు కలిగిన ట్యాంకర్ బయటకు రావడాన్ని గ్రామస్తులు గమనించారు. వెంటనే ట్యాంకర్‌ను వెంబడించి గ్రామ శివారులో పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా వ్యర్థ రసాయనాలను బయట పారబోసేందుకు తీసుకెళ్తున్నామని చెప్పడంతో అతడి వద్ద నుంచి లారీ తాళం లాక్కొని పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు రాత్రి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్యాంకర్ డ్రైవర్ పరారీ కాగా.. ట్యాంకర్‌లో ఉన్న కెమికల్స్‌కు సంబంధి ఎలాంటి ఇన్‌వాయిస్ లభించలేదు. దీంతో పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ శాస్త్రవేత్త పురుషోత్తం రెడ్డి ట్యాంకర్ నుంచి కెమికల్ శాంపిల్స్ సేకరించారు. వీటిని సెంట్రల్ ల్యాబ్‌కు పంపించి రిపోర్ట్ వచ్చిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి కంపెనీలతో బేరం కుదుర్చుకుని వ్యర్థ రసాయనాలను బయట పారబోస్తున్నారని మాజీ సర్పంచ్ బాలెం మల్లేశ్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అనంతరం ట్యాంకర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వృద్ధురాలిపై అత్యాచారం

చందంపేట: మండలంలోని చిత్రియాల గ్రామానికి చెందిన వృద్ధురాలిపై మద్యం మత్తులో అదే గ్రామానికి వ్యక్తి అత్యాచారం చేశాడు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రియాల గ్రామానికి చెందిన 75 ఏళ్ల కేతేపల్లి బాలమ్మ హైదరాబాద్‌లో, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న తన కుమారుడు, కుమార్తెల వద్ద ఉంటోంది. పింఛన్ డబ్బుల కోసం మంగళవారం ఆమె చిత్రియాలకు రాగా.. బాలమ్మకు అల్లుడి వరస అయిన అదే గ్రామానికి చాట్ల బలరాం ఆమెకు ఎదురుపడి ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బలరాం బాలమ్మపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

మహిళను బావిలోకి తోసేసిన యువకుడు

- నీట మునిగి మృతి



కవిత (ఫైల్)

మోత్కూరు: మహిళను యువకుడు బావిలోకి తోసేయడంతో ఆమె నీటిలో మునిగి మృతిచెందింది. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలు.. భువనగిరి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల కాకినాడ బస్తీకి చెందిన మాటూరు కవిత(38), భువనగిరికి చెందిన వంట మాస్టర్ నర్సింహ కలిసి బుధవారం మోత్కూరులో కవితకు వరుసకు అక్క అయిన కొంగరి మమత ఇంటికి వచ్చారు. కవిత, నర్సింహ, మరో మహిళ పుష్ప కలిసి మధ్యాహ్నం 3గంటల సమయంలో మోత్కూరు పెద్ద చెరువు కట్ట సమీపంలోని ముత్యాలమ్మ వ్యవసాయ బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లారు. కవిత ఈత కొట్టేందుకు సిద్ధమవుతుండగా.. దరి మీద నుంచి ఆమెను నర్సింహ బావిలోకి తోసేయడంతో ఆమె బావిలో మునిగిపోయింది. అక్కడే ఉన్న పుష్ప ఆమెను పట్టుకోవడానికి ప్రయత్నించగా బావిలోకి జారిపోయింది. నర్సింహ వెంటనే బావిలోకి దిగి వెతకగా కవిత ఆచూకీ లభించకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మోటార్ల సహాయంతో బావిలోని నీటిని తోడగా.. కవిత మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి అక్క మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కవిత కొంతకాలంగా తన భర్త కిష్టయ్యకు దూరంగా ఉంటుందని, వారికి ఒక కుమారుడు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పాలకవీడు: మండల పరిధిలోని జాన్‌పహాడ్ గ్రామంలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ గ్రామంలోని ఓ ఇంట్లో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారంతా జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.22,100 స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇంటి యజమానితోపాటు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.